# దీప్తి

-సి.ఎం.అనూరాధ

దాదాపు ఇరవై ఐదేళ్ల తర్వాత 'దీప్తి'ని ఇలా చూడగలగడం నా జీవితంలోనే అత్యంత ఆశ్చర్యానందాలను కలిగించిన సంఘటనగా చెప్పవచ్చు. దీప్తిని తిరిగి చూస్తానని అనుకోనేలేదు. అలాంటిది తనను ఇలా సమాజంలో అత్యున్నత స్థానంలో చూడగలగడం నిజంగా ఆనందమే కదా మరి. ఏనాటి దీప్తి ఇప్పుడు ఇలా- ఇది కలా నిజమా అనిపిస్తోంది.

★★★

ఇరవై ఐదేళ్ల క్రిందటిమాట. ఆరోజుల్లో నేను గవర్నమెంట్ స్కూల్ టీచర్‌గా ఓ రిమోట్ ఏరియాలోని చిన్న పల్లెలో పని చేసేదాన్ని. మేముంటున్న ఊరి నుంచి ఆ పల్లెకు వెళ్లాలంటే ఇరవై కిలోమీటర్లు ఒక డొక్కు బస్సులో వెళ్లి తిరిగి రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లవలసి వచ్చేది.

రోజులాగే స్కూల్‌కు వెళ్ళడానికి బయలుదేరి బస్ ఎక్కాను. ఉదయమే లేచి ఇంట్లో పనంతా చేసుకుని స్కూల్‌కి బయల్దేరాలి. అందువల్ల బస్ ఎక్కగానే విశ్రాంతిగా కాసేపు కళ్ళు మూసుకున్నాను. కాసేపటికి బస్‌లో ఏదో కలకలం వినిపిస్తే కళ్ళు తెరచి చూశాను.

సంగతేమిటో కనుక్కున్నాను. ఏడాది వయసున్న చిన్న పాపాయిని బస్‌లో చివరి సీట్‌లో ఎవరో వదిలేసి వెళ్ళారు. బస్ రద్దీగా లేకపోవడంతో ఇంతసేపూ ఎవరూ ఆ విషయం గమనించలేదు.

పాప గుక్కపెట్టి ఏడుస్తుండడంతో అసలు విషయం తెలిసింది. ఇంతకూ పాపని మర్చిపోయి వెళ్ళారా. లేక కావాలని వదిలేసి వెళ్ళారా అర్థం కాలేదు.

ఇంతలో నేను దిగవలసిన స్టేజ్ వచ్చేసింది. అదే లాస్ట్ స్టేజ్. ప్రయాణీకులంతా గుంపుగా మారి పాప విషయమే చర్చించుకుంటున్నారు. ఎవరికి తోచిన సలహాలు వారు చెప్తున్నారు.

పాప తప్పిపోయిన విషయం పేపర్‌కు వేయిద్దామని, పాప తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్ళేవరకు పాప బాధ్యత ఆ ఊరి వాళ్ళెవరైనా తీసుకుంటే సరిపోతుందనీ నేను సూచించాను.

నా మాటలు వినగానే అందరూ ముఖముఖాలు చూసుకుని ఎవరంతట వాళ్ళు వెళ్ళిపోసాగారు. చూస్తుండగానే బస్ ఖాళీ అయిపోయింది పాప, నేను తప్ప.

పాపను అలా ఒంటరిగా వదిలేసి వెళ్ళడానికి మనసు రాక నావెంట స్కూల్‌కు తీసుకెళ్ళాను. మిగతా టీచర్స్‌కి విషయం తెలిపాను. వాళ్ళ సూచన మేరకు పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేసాను. తర్వాత దినపత్రికలో ప్రకటన ఇచ్చాను. మూడు రోజులు గడిచాయి.

పాప ఇంతవరకూ నా దగ్గరే వుంది. ఎవరూ పాపకోసం రాలేదు. చూస్తూ చూస్తూ పాపని ఆ పోలీస్‌స్టేషన్‌లో వదిలిపెట్టి వెళ్ళడానికి మనసు రాలేదు.

తిరిగి పాపను నాతో తీసుకెళ్ళాను. నేను పని చేసే ఊళ్ళో వాళ్ళని అడిగాను ఎవ్వరైనా పాప కోసం వచ్చారేమోనని. ఎవరూ రాలేదన్నారు. నాకంతా అగమ్యగోచరంగా వుంది. పాపని ఏం చేయాలో తెలియడం లేదు. పోనీ నేనే చేరదీద్దామనుకుంటే నా లిమిటేషన్స్ వల్ల అంత ధైర్యం చేయలేకపోయాను.

చాలీచాలని సంపాదన, ఇప్పటికే నాకున్న ఇద్దరు ఆడపిల్లలూ, ముసలివ్వారైన అత్తామామలు, ఎక్కడో దూరాన ఉద్యోగావకాశాలు వెదుక్కుంటున్న నా భర్త. ఇలాంటి పరిస్థితుల్లో పాపను నేనెలా పెంచగలను?

ఆలోచించి ఆలోచించి మెదడు వేడెక్కింది. పరిష్కారం దొరకలేదు. అప్పుడు గుర్తొచ్చింది. ఈమధ్యే దినపత్రికలలో చూసిన వార్త. మేముంటున్న ఊళ్ళోనే కొత్తగా అనాథపిల్లల కోసం 'శిశువిహార్' స్థాపించినట్లు. ఇంకేం ఆలోచించకుండా పాపను తీసుకుని 'శిశువిహార్' వెళ్ళాను. శిశువిహార్ చిన్నదిగా అనిపించినా పరిశుభ్రమైన వాతావరణంలో నెలకొల్పారు.

దాదాపు ఇరవైమందిదాకా పిల్లలున్నారు. అక్కడి ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి పాపను అప్పగించాను.

తర్వాత సంస్థ అధ్యక్షురాలితో మాట్లాడుతుండగా తెలిసింది. కొత్తగా స్థాపించడం వలన ఫైనాన్షియల్‌గా కొన్ని ప్రాబ్లమ్స్ ఉన్నాయనీ, ఆయాలను కూడా తగినంత మందిని నియమించలేకపోయారనీ, స్వచ్ఛందంగా పిల్లల ఆలనా, పాలనా చూడడానికి ముందుకు రావాలని ఆమె విన్నవించారు. కాసేపు ఆమెతో మాట్లాడి ఇంటి దారి పట్టాను.

నాలుగు రోజులుగా పాప నాతో ఉన్నందువల్లనేమో, పాపను వదిలి ఇంటికి రాగానే ఇల్లంతా బోసిగా, మనసులో వెలితిగా అనిపించసాగింది. శిశువిహార్‌లో తన తోటి పిల్లల ప్రక్కన ఓ ఊయలలో, నోటిలో వేలు వేసుకుని పడుకున్న పాప రూపమే గుర్తుకు రాసాగింది.

నిజానికి ఆ చిన్న, చిన్న పిల్లలందరూ ఎంత ముచ్చటగా వున్నారో? ముద్దులొలికే ఆ పసికూనలను ఏం పాపం చేశారని తల్లిదండ్రులు అలా వదిలేశారో? కల్మషం లేని ఆ పాపల చిరునవ్వులు ఎంత స్వచ్ఛంగా ఉన్నాయో?

మరుసటి రోజు స్కూల్ వదలగానే ఇంటికి కూడా రాకుండా అటే శిశువిహార్‌కు వెళ్ళాను. పాపని ఇక్కడ చేర్చడం సబబేనా అని పదే పదే నా మనసు ప్రశ్నిస్తోంది.

కానీ నా పరిస్థితుల్లో నేను చేయగలిగినది ఇదొక్కటే. శుభ్రమైన బట్టల్లో చెరగని చిరునవ్వుతో పాప కనిపించేసరికి నా అనుమానం పటాపంచలయింది. అప్పటికే ఇద్దరు ముగ్గురు వాలంటీర్లు చేరినట్లున్నారు. పిల్లలందరికీ శుభ్రంగా స్నానాలు చేయించి ఉంచారు.

కొందరు పిల్లలకు తినిపిస్తూ, కొందర్ని నిద్రపుచ్చుతూ బిజీగా కనిపించారు. పాపకోసం కొన్ని ఫ్రాక్స్ వారికి అందించి వెనుదిరిగి వస్తుంటే అనిపించింది. పాపకు నా పరిధిలో నేను న్యాయమే చేశానని.

అప్పటినుంచి పాపను రెండు రోజులకొకసారి వెళ్ళి చూసి వస్తుండేదాన్ని.

ఇంతలో సమ్మర్ హాలిడేస్ వచ్చేశాయి. హాలిడేస్ అంతా ఒకటే దినచర్య అయింది. ప్రతిరోజూ ఉదయమే పనంతా చేసుకుని శిశువిహార్ వెళ్లడం, తిరిగి మధ్యాహ్నం ఇంటికి రావడం. ఒక్కోసారి నా పిల్లలు కూడా నాతో వచ్చేవారు.

అక్కడ పిల్లలకు స్నానం చేయించడం, నిద్ర పుచ్చడం, అన్నం తినిపించడం, ఆడించడం, ఇలాంటి పనులతో టైమ్ తెలిసేది కాదు. ఇలా సమ్మర్ హాలిడేస్ ఎప్పుడు పూర్తయ్యాయో కూడా తెలీకుండా గడిచిపోయాయి.

ఈ హాలిడేస్‌లో ప్రతిరోజూ శిశువిహార్ వెళ్తూండడం వల్ల పాప నన్ను బాగా గుర్తుపట్టసాగింది. నన్ను చూడగానే ఆ చిన్న వదనం ఎంత కాంతితో మెరిసిపోయేది. నాతో అక్కడికి వచ్చే నా పిల్లలు నన్ను అమ్మా అని పిలవడం చూసి తను కూడా ముద్దుగా 'అమ్మా' అని పిలిచేది. నేనక్కడ ఉన్నంతసేపూ నా వెన్నంటే తిరిగేది.

శిశువిహార్‌లోని పిల్లకు పేరు పెట్టేప్పుడు, పాపకు పేరు నన్నే పెట్టమని అడిగారు. ఈ చిన్నారి పాప తనలాంటి ఎందరో అనాథల జీవితాలకు వెలుగు కావాలనే ఉద్దేశ్యంతో పాప పేరు 'దీప్తి' అని పెట్టాను.

సమ్మర్ హాలిడేస్ తర్వాత తిరిగి స్కూల్స్ తెరిచారు. ఇక ఆ హడావుడిలో పడిపోయాను. అటెండెన్స్ రిజిష్టర్స్ తయారుచేసుకోవడం, లెసన్ ప్లాన్స్ వ్రాసుకోవడం ఇలా క్షణం తీరిక లేకుండా పోయింది.

శిశువిహార్‌కు వారం రోజుల తర్వాత మాత్రమే వెళ్ళగలిగాను. నన్ను చూడగానే 'దీప్తి' పరిగెత్తుకుంటూ వచ్చి కాళ్ళకి చుట్టుకుపోయింది. వారం రోజులు వరుసగా కనిపించకపోవడం వల్ల దిగులు పెట్టుకున్నట్లుంది. పాపని అక్కున చేర్చుకున్నాను. నా చేతుల్లో పక్షికూనలా ఒదిగిపోయింది.



పాపకూ, నాకూ ఏమిటీ సంబంధం! నేను తీసుకెళ్ళిన ఫ్రూట్స్, బిస్కెట్స్ తన తోటి పిల్లలందరికీ పంచింది. ఇటువంటి విషయాలు శిశువిహార్‌లోని పిల్లలకు చెప్పనవసరమే లేదు. తమ దగ్గర ఏమున్నా అందరికీ పంచనిదే ఎవరూ తినరు. పిల్లలు అంత డిసిప్లీన్డ్‌గా ఉంటారు.

క్రమంగా శిశువిహార్‌కు ఆదివారం మాత్రమే వెళ్ళడానికి వీలయ్యేది. ఆదివారం కోసం నాకు తెలీకుండానే నేను ఎదురు చూసేదాన్ని. ప్రతి నెలా ఫస్ట్ తారీఖున శ్యాలరీస్ వచ్చిన రోజు మాత్రం తప్పకుండా శిశువిహార్ కెళ్ళి, నాకు తోచినంత, నాకు వీలైనంత అమౌంట్ ఇచ్చి వచ్చేదాన్ని. అలా ఒక్క సంవత్సరం గడిచింది.


దీప్తికి రెండేళ్ళు నిండాయి. చాలా కబుర్లు చెప్పేది.

ఇంతలో అనుకోకుండా మావారికి అమెరికాలో మంచి ఉద్యోగం వచ్చింది. నేను నా జాబ్‌కి కూడా రిజైన్ చేయవలసి వచ్చింది. మా ఫ్యామిలీ అంతా అమెరికాకు వెళ్ళాం.



## ఐశ్వర్యతో సల్మాన్!!

సల్మాన్‌ఖాన్-ఐశ్వర్యారాయ్‌లు ముఖాముఖీ ఎదురుపడ్డానికి కూడా ఇష్టపడరని వేరే చెప్పక్కర్లేదు. అయితే తాజా వార్తల ప్రకారం- ఐశ్వర్య ప్రక్కన సల్మాన్ నిలబడబోతున్నాడట. లండన్‌లోని ప్రముఖ వాక్స్ మ్యూజియంలో నిలబెట్టబోయే కొత్త బొమ్మ సల్మాన్ ఖాన్‌దేనట. వచ్చే జనవరిలో ఆవిష్కరించబోయే సల్మాన్ వాక్స్ బొమ్మను ఐశ్వర్య వాక్స్ బొమ్మ పక్కనే వుంచబోతున్నారట మ్యూజియం నిర్వాహకులు. కమర్షియల్‌గా జనాల్ని ఆకట్టుకోవాలనే ఇలా ఇద్దరినీ పక్కపక్క వుంచుతున్నామంటున్నారు వాళ్లు.




వెళ్ళే ముందు శిశువిహార్ కెళ్ళాము. పాపను వదిలి వస్తుంటే కన్నీరాగడం లేదు. పాపను జాగ్రత్తగా చూసుకొమ్మని అందరికీ చెప్పాను. శిశువిహార్ అధ్యక్షురాలైన రమాదేవిగారిని కలిసి లక్షరూపాయలు పాప పేరుతో డిపాజిట్ చేశాను.

నేను జాబ్ రిజైన్ చేసినప్పుడు వచ్చిన మొత్తం అది. ఆ డబ్బును పాప చదువుకు ఖర్చుపెట్టమని, పాపను పై చదువులు చదివించమని ఆమెను రిక్వెస్ట్ చేసుకున్నాను. అందరి దగ్గరా సెలవు తీసుకుని అమెరికా వెళ్ళిపోయాము.

అమెరికాలో అడుగు పెట్టిన తర్వాత ఒక్కసారిగా మా జీవితం మారిపోయినట్లయింది. ఇక్కడి మెటీరియలిస్టిక్ జీవితానికి అడ్జస్ట్ కావడానికి మాకు ఎక్కువటైమే పట్టింది.

నెమ్మదిగా అందరం ఈ జీవితానికి ఎడ్జస్ట్ అయ్యాం. తప్పదుమరి. పిల్లలిద్దరూ ఇక్కడే చదువు పూర్తి చేసి పెద్దమ్మాయి సైంటిస్ట్‌గానూ, చిన్నమ్మాయి ఇంజనీర్‌గానూ సెటిలయ్యారు. మాకున్నంతలో వాళ్ళ వివాహాలు కూడా చేసేశాం. చూస్తుండగానే మేము అమెరికా వచ్చి ఇరవై ఐదేళ్ళు పూర్తయ్యాయి.

ఇన్నేళ్ళలో మేము ఒక్కసారి కూడా ఇండియాకు రావడం కుదరలేదు. ఇండియాకు వెళ్ళడమంటే ఇక తిరిగి అమెరికాకు రాకుండా వెళ్ళడమే అనేవారు మావారు. మేం అమెరికా వచ్చిన మొదట్లో దీప్తి బాగా గుర్తుకొచ్చేది. రమాదేవిగారితో కూడా ఉత్తర ప్రత్యుత్తరాలు రెగ్యులర్‌గా ఉండేవి. కానీ రాను రాను ఉత్తరాలు పూర్తిగా ఆగిపోయాయి. దీప్తిని కూడా నేను దాదాపుగా మరచిపోయాను.

మావారు అనుకున్నట్లే మేం ఇండియాకు పూర్తిగా తిరిగొచ్చేశాం. దాదాపు ఇరవై ఐదేళ్ళు తర్వాత. తన చిన్ననాటి ఫ్రెండ్ ద్వారా మా వారు తమ స్వంత పల్లెలో ఇల్లు కట్టించారు.

మేం వచ్చేసరికి ఇల్లు రెడీగా ఉంది. చుట్టూ తోట, మధ్యలో చిన్ని ఇల్లు చాలా అందంగా ఉంది. మేం ఇండియాకు తిరిగి వచ్చి నెల కావస్తూంది. అమెరికాలో ఆ బిజీలైఫ్ తర్వాత ఈ పల్లెటూళ్ళో ప్రశాంతమైన జీవితం చాలా సుఖంగా అనిపిస్తోంది. క్రమంగా ఊళ్ళోవాళ్ళు పరిచయమవుతున్నారు.

★★★

ఒకరోజు సాయంత్రం నేను తోటలో ఉండగా కొంతమంది యువకులు వచ్చి "మాధవిగారంటే మీరేనాండీ" అని అడిగి మరీ ఇన్విటేషన్ ఇచ్చి వెళ్ళారు.

"రేపు ఉదయం పది గంటలకు కలెక్టర్‌గారిచే ఈ ఊళ్ళో కొత్తగా నిర్మించిన అనాథాశ్రమం మరియు వృద్ధాశ్రమం ప్రారంభించబడుతాయనీ, అందరూ రావలసిందనీ" ఆ ఇన్విటేషన్ సారాంశం. నాక్కూడా ఇంట్రెస్టింగా అనిపించి మరుసటి రోజు ఉదయం ఆ కార్యక్రమాలకు వెళ్ళాను. జనం బాగా వచ్చారు. కుర్చీలన్నీ నిండిపోయి ఉన్నాయి.

ఎవరినోట విన్నా ఆ కలెక్టర్‌గారి గురించే. వృత్తిపట్ల ఆమెకున్న అంకితభావం గురించి, ఆమె నిజాయితీ, నిరాడంబరతల గురించీ మాట్లాడుకుంటున్నారు. నాక్కూడా కలెక్టర్‌గారిని చూడాలని చాలా కుతూహలంగా ఉంది.

ఇంతలో అక్కడికి ఓ కారు వచ్చి ఆగింది. గుంపులుగా చుట్టుముట్టిన జనం మధ్యనుంచి నడిచి వచ్చి వేదిక నలంకరించారు కలెక్టర్‌గారు. జనం మాటల్లో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. సాధారణ కాటన్ చీరలో ఎంతో సింపుల్‌గా ఉందామె.

ప్రసన్నంగా ఉన్న ఆమె వదనంలో ఠీవి, ఆమె మాటల్లో మన్నన. ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా ఆమె చేతుల మీదుగా జరిగింది. ఇద్దరు, ముగ్గురు ప్రముఖుల ప్రసంగం అనంతరం కలెక్టర్‌గారి ప్రసంగం మొదల

యింది. ఆ అమ్మాయి మాట్లాడుతోంటే అలాగే వినాలనిపిస్తోంది. సామాజిక సేవ గురించీ, సమ సమాజ నిర్మాణానికి చేయవలసిన కృషి గురించీ అనర్గళంగా స్వచ్ఛమైన తెలుగులో హృదయానికి హత్తుకునేలా ప్రసంగిస్తోంది. చివరగా అనాథ శరణాలయానికి గవర్నమెంట్ ఫండ్ కాక తను స్వయంగా రెండు లక్షల రూపాయలు విరాళం ప్రకటిస్తూ ప్రసంగాన్ని ముగించింది. ప్రజల కరతాళ ధ్వనులు మిన్నంటాయి.

తరువాతి కార్యక్రమం కలెక్టర్‌గారికి సన్మానం.

పెద్ద పెద్ద పూలదండలు తీసుకుని ఊరిలోని ప్రముఖులందరూ వేదికమీదికొచ్చారు. "ఒక్క క్షణం" అంటూ కలెక్టర్ మైకు తీసుకున్నారు.

"ఇప్పుడు మీరు చేయబోయే సన్మానం అందుకోవలసింది నేను కాదు. నిజానికి ఈ సన్మానానికి పూర్తిగా అర్హులైన వారు ఈ సభలోనే ఉన్నారు. ఆమెకే ఈ గౌరవం దక్కాలి. నేనిప్పుడే స్వయంగా ఆమెను వేదిక మీదకు తీసుకొస్తాను'' అంటూ వేదిక దిగి సడెన్‌గా నా ముందుకొచ్చి నిల్చుంది "అమ్మా'' అంటూ. ఆ పిలుపులోని ఆర్తి నా మనసు పొరల్ని తాకుతోంది. నాకేదో అర్థమై కానట్లుంది. సడెన్‌గా నాకేదో స్ఫురించింది.

"దీప్తీ'' సంభ్రమంగా అన్నాను.

"అవునమ్మా! దీప్తినే, నీ దీప్తిని!'' నా పాదాలనంటి నమస్కరించింది.

అందరూ నన్నే వింతగా చూస్తున్నారు. నేను వారించినా వినకుండా వేదిక మీదకు తీసుకెళ్ళింది.

"ఈ ప్రేమమూర్తి దయవల్లే నేనింతటి దాన్నయ్యాను. అనాథనైన నన్ను చేరదీసి నా జీవితాన్ని నిలబెట్టిన దేవత ఈమె. ఎవరూ లేని నాకు తన ప్రేమామృతాన్ని పంచి అమ్మ అయింది. నా చదువుకు తన శక్తికి మించి సహాయం చేసి నా జీవితానికి వెలుగు అయింది. నన్నింతటి దానిని చేసిన ఈ మహనీయురాలికి శతకోటి వందనాలు'' దీప్తి ప్రసంగం ముగించి నా మెడలో పూలదండ వేయడం, వెను వెంటనే లెక్కలేనన్ని పూలదండలు నా మెడనలంకరించడం. చప్పట్లతో ఆ ప్రదేశం మారుమోగిపోవడం, ఇవేమీ గమనించే స్థితిలో లేను నేను.

నా హృదయం అవ్యక్తమైన ఆనందంతో నిండిపోయింది. 'దీప్తి ఎంత ఎత్తుకు ఎదిగింది.' సభలోని వారంతా నన్ను మాట్లాడమన్నారు. మెల్లగా లేచి మైక్ అందుకున్నాను.

"నేను చేసినది పెద్ద సహాయం కాదు. అనాథ శిశువులను కన్నబిడ్డలుగా చేరదీసిన మహా వ్యక్తులెందరో ఉన్నారు. అటువంటి గొప్పవారి ముందు నేనో గడ్డిపోచను. నేను చేసిన సాయం చాలా చిన్నది. అయితే ఆ చిన్ని సాయాన్ని రిసీవ్ చేసుకున్న ఈ అమ్మాయి మనసు గొప్పది. అందువల్లే తనకు నేను చేసిన చిన్న సహాయం గొప్పగా కనిపిస్తోంది. భగవంతుని దయవలన ఈ అమ్మాయి ఇంకా ఎత్తుకు ఎదగాలని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను'' నా కళ్ళ నుంచి ఆనందబాష్పాలు రాలి దీప్తి తలపై పడ్డాయి.

ఇదీ ఇరవై ఐదు సంవత్సరాల ఫ్లాష్ బ్యాక్. ఆ రోజు సభ పూర్తవగానే వెళ్ళిన దీప్తి తిరిగి రెండురోజులకు తీరికగా నా దగ్గరకొచ్చింది. తనని చూడగానే రెండు రోజులనుంచి నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అనుమానాన్ని బయటపెట్టాను.

"దీపూ! నన్నెలా కనుక్కున్నావ్! నీ వివరాలే నాకు అందలేదు'' దీప్తి చిన్న పిల్లలా సంబరంగా చెప్పింది.

"అమ్మా! నాకు ఊహ తెలిసినప్పటినుంచీ రమాదేవి మేడమ్ నీ గురించి చెప్పేవారు. అనాథనైన నన్ను నీవు తీసుకురావడం, ప్రతిరోజు వచ్చి చూసుకుని వెళ్ళడం, తర్వాత అమెరికా వెళ్ళేముందు నీ కష్టార్జితాన్ని నాకోసం నా చదువుకోసం అందించడం అన్నీ చెప్పారు. అప్పుడు నేననుకున్నాను. ఆ అమ్మ కోరిక ప్రకారం నేను బాగా చదువుకోవాలని. అలాగే నీకు సడెన్ సర్‌ప్రైజ్ ఇవ్వాలని రమాదేవి మేడమ్ నడిగి మీ అడ్రెస్ అన్నీ తెలుసుకున్నాను. నా వివరాలేవీ నీకు తెలియనీయవద్దనీ, ఎప్పుడో ఒకరోజు నేను నీకు సర్‌ప్రైజింగ్‌గా కనిపిస్తాననీ మేడమ్‌కు చెప్పేదాన్ని. రమాదేవి మేడమ్ అమెరికాలో ఉన్న తన ఫ్రెండ్ ద్వారా ఎప్పటికప్పుడు మీ వివరాలు తెలుసుకుని నాకు చెప్పేవారు. మీరు ఇండియా వస్తున్న విషయం కూడా ఆమె ద్వారానే తెలిసింది. ఈ విషయం తెలిసే మొన్నటి ప్రోగ్రాం కూడా ఫిక్స్ చేసుకున్నాను''

దీప్తి మాట్లాడుతుంటే నేనలాగే ఉండిపోయాను. నా హృదయం ఆర్ద్రమైపోయింది. నేనేనాడో నాటి మరచిపోయిన ఆ చిన్ని మొక్క ఈనాడు మహావృక్షమై పదిమందికీ సాయపడే ఉన్నత స్థితిలో ఉందంటే నాకంటే సంతోషించే వారెవరుంటారు. ఏనాడో నేను అందించిన చిరుసాయాన్ని ఆసరాగా తీసుకుని కొండంత ఎత్తుకు ఎదిగింది ఈ చిన్ని పాప. ఈ చిరుదివ్వె పదిమంది జీవితాలలో వెలుగు కావాలని ఆశించిన నా ఆకాంక్ష నేడు నిజమైంది. ఇంతకంటే నాకింకేం కావాలి.

★

## డైవోర్స్ లోన్

ఇటీవల జపాన్‌లో ప్రతి వెయ్యిమంది జనాభాకి రెండు డైవోర్సులు ఉంటున్నాయిట. డైవోర్స్ ఇచ్చాక మనోవర్తిగా 40 లక్షల ఎన్స్‌ని ఇవ్వాల్సి వస్తోందిట. కోర్టు కేసులవల్ల, మనోవర్తి ఇవ్వడంవల్ల చాలామంది ఆర్థికంగా చితికిపోతున్నారు. అందుకని ఇప్పుడు జపాన్‌లో కొన్ని బ్యాంకులు డైవోర్సు లోన్సు ఇస్తున్నాయిట.

## కోర్టుకి వెళ్ళిన కవలలు

బీజింగ్ హాస్పిటల్‌లో 21 సంవత్సరాలనాడు సియాంగ్‌నాన్, వాంగ్ ఇవెన్‌లు కవలలుగా పుట్టారు. హాస్పిటల్‌లోని వారు పొరపాటున వాంగ్ ఇవెన్, మరొకరి బిడ్డ వాంగ్ ఇవూలను తారుమారు చేసారుట. ఇన్నేళ్ళుగా వాంగ్ ఇవూయే తన కవల సోదరుడనుకుంటూ వచ్చాడు సియాంగ్‌నాన్. గతంలో రెండు కుటుంబాలు పక్కపక్కన ఉండేవి. ఆ పిల్లల రెండేళ్ల వయస్సులో దూరమైపోయారు. 19 సంవత్సరాల తరువాత యాదృచ్ఛికంగా అసలు అన్నదమ్ములిద్దరూ అదే కళ్లు, అదే మూతి అదే ముఖంతో అచ్చుగుద్దినట్లు ఆ కుటుంబాల కామన్ ఫ్రెండ్స్ ఎదురుపడ్డారు. వాళ్ల గుర్తింపుతో అసలు సంగతి తెలిసింది. ఆసుపత్రిలో ఈ మార్పిడి జరిగిందని గ్రహించిన అన్నదమ్ములిద్దరూ ఒకేరకం జీన్స్, షర్టులు వేసుకుని కోర్టుకు వెళ్లి ఆ హాస్పిటల్‌మీద కేసు వేసారు.

-తటవర్తి

